# ది రెడ్ రోజ్ |

మధ్యాహ్నం చేసినదోసకాయపప్పుకాని, మామిడికాయపప్పుకాని అట్టే పెట్టి రాత్రికి వడ్డిస్తే — మా ఎడిటర్ అట్ హోమ్- "వాట్ సీటా! ఈవెనింగ్ మిడ్‌నైట్ డాక్ ఎడిషన్స్‌కి సేం మేటరేనా! పేజీమార్చు" అంటారు చిరాగ్గా, అఫిషియల్ లాంగ్వేజీ ఇంట్లో మాట్లాడే వాళ్ళను చూస్తే "పిటీ" చేయాలనిపిస్తుంది. నాక్కోపవొచ్చి "ఈవాళ హెడ్ లైన్స్ేవిటి చెప్పండి అని ప్రశ్నిస్తాను. "బెండకాయ వేయించి కొబ్బరి కాయ పచ్చడి చెయ్యి. నిన్నటి మేటరుంటె కిల్ చెయ్యి. దాన్ని వాడైకు, ఇంకా కొన్ని కాలమ్స్ బ్లాంకుంటే కందిపొడుం, గోంగూర, కే. కె., (కొరివికారం) ల్తో సరిపెట్టు" అంటారు హవుస్ మొగుడు, హవుస్‌వైఫ్ నాతో.

"పప్పుచారు స్టాండింగులో వుందండీ,"

"డామ్ దట్ బ్లడీ పప్పుచారు, పనిమనిషి కిచ్చే సప్లిమెంట్లో తోసెయ్యలేకపోయావా?"

"ఉల్లిపాయలు వేసి చేశానండీ ఘుమఘుమ లాడ్తోంది. దానికి పొయ్యబుద్ధికాలేదు. మరోసారి పొయ్యిమీద పెట్టి దించేస్తే."

"షటప్! మళ్ళీ పొయ్యిమీదెక్కిస్తావ్? సేం మేటర్ రిపీట్ చేస్తే ఎల్లా సయిస్తుందే మై బిలవ్వుడు?"

"అదికాదండీ బిలవ్వుడుగారూ— వేడిఅన్నంలో చల్లటిపప్పుచారు పోసుకుని కమ్మని అప్పళమ్స్ ఆర్ వడియాలు నంచుకు తింటే పోనీ చల్లమిరపకాయలు."

"హ్హో నా మూడ్ స్పాయిల్ చేస్తున్నావే సిల్లీ బ్రూట్" అలా సాగుతుంది మా సంభాషణ. ఏ గూటి చిలక ఆ గూటిపలుకు, ఇలా ఉద్యోగ వాతావరణాన్ని ఇంట్లో దింపేయడం, ఆ భాషా ఆ అలవాట్లూ యథారాజా తథాప్రజా అన్నట్లు, కేట్సులాగ డాగ్సులాగ మనవంతా ఇమిటేట్ చేయడం; ఆ ముక్కలే పిల్లలుకూడా నోటకరుచుకోడం తల్చుకుంటే నాకు సిల్లీగా వున్నప్పటికీ, లైఫ్‌లో తప్పడంలేదు. మనం పీల్చే గాలీ, తాగే నీళ్ళూ, తినే అన్నమూ, వుండే కొంపా, నాలుగ్గోడలూ, ఈ వృత్తి వాసనతో బోరు కొట్టేస్తుంటాయి. ఈ ప్రొఫెషనల్ స్మెల్‌కొట్టకుండా ఏ కొంపా వుండదేమో! ఈ రోజుల్లో నాలుగురాళ్ళు ఇంట్లోకి తెచ్చి పడేసే మగాడి, లేక మొగలిపువ్వులాంటి మొగుడి ఉద్యోగం వాసనకొట్టని "స్వీట్ హోమ్" ఏ దేశమేగినా ఎందు కాలిడినా వుండదు. దగ్గరకొస్తే మొగుళ్ళ ఉద్యోగం వాసనకొట్టే ఆడవాళ్ళంటే నా కసహ్యం, మొగుళ్ళకు కార్బన్ కాపీలు తీసియిచ్చే డూప్లికేటింగ్ మెషీన్లయిపోయారు ఈ ఆడాళ్ళు. మొగుళ్ళు ఒరిజినల్‌కాపీలా తళతళలాడ్తూంటే, కార్బన్ కాపీల్లా అలుముకు పులుముకుపోయివుంటారు దీజ్ లేడీస్. అఫ్‌కోర్స్ కొంతమంది మగాళ్ళే కార్బన్‌కాపీల్లా ఐదో ఇంప్రెషన్లా గుంటారనుకోండి. అది వేరే సంగతి.

నాటకాలవాళ్ళ కొంపల్లో రిహార్సిల్సూ, థర్డ్ సీనూ, ఫస్టుసీనూ క్లయిమాక్సు కంపూ, జర్నలిస్టు యింట్లో, గోడల్నిండా ఎనిమిదికాలాలూ ఆఫ్‌పేజీ ఫుల్‌పేజీ ప్రకటనలూ, బిజినెస్ మాగ్నెట్ హవుస్లో సోఫాలూ డబల్‌బెడ్సూ పరుపులూ, దుప్పట్ల నిండా ఆస్తి అప్పులపట్టీల మరకలూ, ట్రయల్ బాలెన్సూ. ప్రాఫిట్ అండ్ లాస్ స్టేట్‌మెంట్లు, డాక్టర్ల బంగళాలో, మందుల పేర్లూ, ఆపరేషన్లూ, ఇంపేషంట్ల జబ్బుల పేర్లూ, రైల్వేవాడి క్వార్టర్సులో, పెళ్ళీడుఆడపిల్లల నోట్లోకూడా రైల్వే వర్కింగ్ టైంటేబిలు— అప్ ట్రెయిన్సు, డవున్ ట్రయిన్స్ నంబర్లూ, రన్నింగు టైం రేట్సు, లాసులూ మేకప్పులూ. ప్రెస్సువాళ్ళ పెంకుటిళ్ళలో ఆఫ్‌బాడీలు

పుల్ బాడీలు. బ్లాకులు, స్టిక్కులూ, మవుంట్లూ, గాలీలు, పాయింట్లూ పైపులూ గోల, సినిమావారి స్వీట్ స్వీట్ హోమ్సులో, బ్లాక్‌మనీ, హీరోయిన్ల నడుముచుట్టు కొల్తలూ, బంగారపు మొనగాళ్ళ మనసులూ– గుడిసెల్లో కొట్టుకోడాలు– తిట్టుకోడాలూ, కేకలు, అరుపులు, ఏడుపులు, నవ్వులూ, సూర్యచంద్రులూ. నక్షత్రాలూ. వానా, వరదా, ఎండా-వానా, చీకటి- వెన్నెలా, భయమూ, బ్రతుకూ, కడగండ్లూ కన్నీళ్ళు, గుమస్తా గాడి అర్ధకాంపలో, రాని ఇంక్రిమెంట్లూ. పలకనిలాటరీటిక్కెట్లు, ఆఫీసర్ల మేలిరకం చిరునవ్వులవెన్నెల రత్నాలు కురియు క్యాలండర్లూ, ఆరిపోయిన బొగ్గులకుంపటి, ఆరిపోతూ కుంపటిలా అప్పుడప్పుడు కిరసనాయిలుపోస్తే భగ్గుమనే ఆడదీ, వేస్ట్ న్యూస్‌పేపరూ, వెలిసిపోయిన ఆశయాలు, పాల డబ్బాలూ– పళ్ళూడిన దువ్వెనా, పళ్ళురాలిపోయి కళ్ళు కనపడని ముసలమ్మా, కాళ్ళకడ్డంపడే పిల్లలూ, పుష్కరం చుట్టాలూ, పుష్కరం గడిచినా తీరని అప్పులూ ఇవే మన బ్రతుకులు.... అవే అవే అతుకులు.... ఆ మెతుకుల కోసవే. ఈ గతుకుల బాటవెంబడి ప్రయాణం ––

మై గాడ్! ఈ విశ్వరూపంలో, బలాబలాలు, కుస్తీపట్లు, టగాఫ్ వార్లు.... ఎవరిగొడవవారిదే. నీ నెత్తిమీన పిడుగుపడితే, నడవటానికి శక్తిలేక, బస్సులో సీటులేక, రైలు మిస్సయిపోతే–నువ్వు పెళ్ళాడదల్చుకున్నది నీకు డొక్కలో కిక్కిస్తే— నువ్వెక్కిన రిక్షా బోల్తాకొట్టి నీకు చెయ్యో కాలో విరిగితే, నీ వుద్యోగంవూడిపోతే, నీ పడవలోకి నీళ్లొస్తే, నీ పక్కలోకి పామొస్తే... వాట్ కెన్యూ డూ- బట్- టేకిట్ ఈజీ మై గుడ్ బోయ్ ఆర్ గర్ల్ ఆర్ లేడీ.. దిసీజ్ లైఫ్. అవర్ లైఫ్ ఈజ్ లైక్ దట్.

ఈ ప్రపంచం ఒకోరికి ఒకోలాగ, తలొకరికి తలకోలాగ ఎందుక్కనపడ్తోంది? నీరూ నిప్పూ గాలి, వెల్తురూ, ఎండా-వానా, చీకటి– వెలుగూ, ఏడుపూ-సంతోషం అందరికీ ఒకలా ఎందుకుండవు? రిక్షా వాడు తడుస్తూ ఎందుకు సైకిలు త్రొక్కాలి? రిక్షాలోవాడు తడవకుండా

ఎందుకు కూర్చోవాలి? లాభనష్టాలంటే ఏవిటి? తనకు నష్టం లోకానికి లాభంకావచ్చు. తనకులాభం లోకానికి నష్టంకావచ్చు. ఈ తనకు లాభం గాళ్ళని తన్నరే (వీళ్ళది ఈ సొంతలాభంగాళ్ళది ఫ్రీ ఎంటర్ ప్రయిజుట. అది సృష్ట్యాదినుంచీ వస్తోందట. ఫ్రీ అంటేఅర్థం దోచుకోడానికి ఫ్రీ.) ఈ "ఫ్రీ" ఎంటర్ ప్రయిజుగాళ్ళు దౌర్భాగ్యులకి గార్డియన్సని దిగ్రేట్ గాంధీ చెప్పారు. "ఫ్రీ" ఎంటర్ప్రయిజుగాళ్ళను దోచుకోనివ్వడం, వాళ్ళు పెట్టింది తిని భక్తిగా "సబుకో సన్మతి దే భగవాన్"అని రాంభజనచేయడం,అహింస. దౌర్భాగ్యులు తిరగబడితే హింస, లాభాలను పోగుచేసుకోనివ్వడం, మార్వాడీలను, సేఠ్లను లావుపెరగనివ్వడం ప్రజాస్వామ్యం—వాళ్ళు కుక్కలకు రొట్టెముక్కలా యింతపడేస్తే ధర్మంగా తిని, వాళ్ళ కోసం చెమటలుకార్చి, ఆ చెమటంతా వంద రూపాయలనోట్ల కట్టలయి బ్యాంకుల్లో మూలుగుతూంటే '"ఇదేవిటీ అన్యాయం" అంటే అరాచకం! అరాచకాన్ని తుపాకీల్తో అణచాల్సిందేకదా! తుపాకీగుండుతగిలే మనిషి ధామ్మనిపడ్తాడు. నెత్తురొలుకుతుంది. ఆ భూమ్మీద అలా ఒలికిననెత్తుర్నపీల్చుకుని"ఎర్ర గులాబీలు"పూస్తాయి. అటువంటి రెడ్రోజ్ని తాకడానికి నమ్ముండాలి. అదికోట్ బటన్కి పెట్టుకునితిరిగిన హీరోకి లోపల గుండె ఎంతెలా పుడికిపోయి వుండాలోకదా! దౌర్భాగ్యులకి తానేమీ చేయలేకపోయాననేచింత రెడ్రోజ్పెట్టుకున్న ఆ మహాత్ముని వారసుడ్ని జీవితాంతం ముల్లులా పొడిచేవుంటుంది. తరవాత్తరవాతొచ్చి మనపీకలమీద కత్తిలా కూర్చున్న వాళ్ళ రాజ్యంలో "పీపుల్సగతి" హు కేర్స్ ఫరిట్? అహింసామూర్తులరాజ్యం రావలిసిందిపోయి, అహింసామూర్ఖుల రాజ్యంలో పడ్డాం.

హౌ ఫూలిష్ ఇటీజ్ ఫర్ మి? మా అహింసా మూర్ఖులు పడక కుర్చీలో పడుకుని గుర్రెట్టి నిద్రపోతున్నారు. లేపనా వద్దా? పప్పులుసు స్టాండింగులో అలావుండిపోతుంటే? బై ది బై లేపెననుగాక! బిలవ్వుడు గారు బిలవ్వుడుగారూ లేచి కంచంమీదకు కలబడండి. ది అప్పళమ్స్ చల్లమిరపకాయలు ఎట్సిట్రా ఆర్ రడీ మిష్టర్!